# దొండూ దొండే

వెలువలి సుగీత

మొదటి కథ

శ్రావణమాసపు ఎండ చిటపట లాడిస్తోంది. నరసాపురం బస్టాండ్‌లో జనం పలుచగా వున్నారు. అరగంట నుంచి బస్‌కోసం ఎదురు చూస్తోంది సత్యవతి. ఆచంట వెళ్లాలామె.

చూసి చూసి వెనక్కివచ్చి ఓ బెంచీమీద కూర్చుంది. ఏదో బస్సు వచ్చింది. గబగబా ఎదురెళ్లి బోర్డ్ చదివింది. తన ఊరు వెళ్లేది కాదు... ఉస్సూరంటూ వెనక్కి వచ్చి మళ్లీ బెంచీ మీద కూర్చుంది.



ఆ బెంచీమీద చాలాసేపటినుంచి సత్యవతిని గమనిస్తూ నల్లగా, లావుగావున్న ఒకావిడ కూర్చుని వుంది. ఆవిడపేరు విమలమ్మ. చిన్నా చితకా మోసాలు చేస్తూ బతుకుతూంటుంది. చాలా తెలివైంది. అరగంటనుంచి సత్యవతినీ, ఆమె మెళ్లోవున్న బంగారు గొలుసునీ చూస్తోంది.

సత్యవతి నుదుటికి పట్టిన చెమటని తుడుచుకుంటూ వెనక్కివాలి కళ్ల మూసుకొంది.

అదే అదునుగా విమలమ్మ తన జాకెట్లోంచీ ఓ న్యూస్‌పేపర్ ముక్కతో కట్టిన చిన్న పొట్లాన్ని తీసి క్రింద పడేసింది. సత్యవతికేసి తిరిగింది. ఇంకా కళ్లు మూసుకునే వుంది సత్యవతి.

'ఏమండీ... ఏమండీ...' పిలిచింది సత్యవతిని విమలమ్మ.

సత్యవతి కళ్లు తెరిచి ఆమెవైపు చూసింది.

"ఏ ఊరెల్లాలండీ..." అంటూ మెల్లగా మాటలు కలిపింది. మాటల్లో సత్యవతిది కొవ్వూరని, కూతుర్ని చూడ్డానికి ఆచంటవెళ్తోందని తెలుసుకుంది.

తనది దగ్గర్లోని పల్లెటూరని, నెలరోజుల క్రితం పడిపోతే కాలువిరిగిందని, కట్టువేసారని, అది విప్పించుకోవడానికి వస్తే ఇంకా ఇరవై రోజులు ఆ కట్టు ఉంచాలని డాక్టరు చెప్పారని చెప్పింది.

అప్పుడు చూసింది సత్యవతి విమలమ్మ కాలికట్టుని, పక్కనేవున్న ఊతకర్రనీ.

కాసేపటికి విమలమ్మ కిందికి చూసి యధాలాపంగా తీసినట్టు అంతకుముందు తాను పారేసిన పొట్లాన్ని తీసి, విప్పింది కళ్లపెద్దవి చేసి ఆనందంగా చూసింది.

ఇదంతా సత్యవతి గమనించింది. తనూ పొట్లంలోకి తొంగి చూసింది. అందులో మిలమిలా మెరుస్తున్న బంగారపు కాసు వుంది. న్యూస్‌పేపర్ లోపల బంగారం వస్తువులు కట్టే ఎర్రపేపర్‌తో కట్టివుంది.

'ఏంటదీ... బంగారంలా వుందే...' అంది సత్యవతి.

'అవునక్కా బంగారమే...' ఎవరు పారేసుకున్నారో చూడు... అని చేతికిచ్చింది.

అపురూపంగా తీసుకుంది సత్యవతి. కాగితంలో వున్న కాసుని చేత్తో తడిమి చూసింది. అయిదురూపాయల కాసు మందంతో వుంది... మిలమిలా మెరిసిపోతూ. ఓపక్క లక్ష్మీదేవి, మరోపక్క పద్మం చెక్కివున్నాయి. కళ్లకి అద్దుకుంది. తిరిగి కాసుని విమలమ్మ చేతికి ఇస్తూ "ఏ తల్లో పూజకోసం కొనుక్కుని పారేసుకుంది" అంది చూట్టూ చూస్తూ. జనం పలుచగా ఎవరి గొడవలో వాళ్లున్నారు.

"అక్కా... ఎవరూ లేరు కదా మనిద్దరం తీస్కుందామేంటి దీన్ని?" అంది విమలమ్మ.

సరస్వతికి కూడా ఆశపుట్టింది.

"అక్కా బయట బంగారం కొట్లో చూపించి వెల కట్టించి, డబ్బు తీసుకురా ఇద్దరం చెరిసగం తీస్కుందాం" నేను అంతదూరం నడవలేను అంది విమలమ్మ తన కాలిని చూస్తూ.

సరే అంది సత్యవతి. "అక్కా మరే నేను గబగబా నడవలేను కదా నువ్వు ఈ కాసు తీస్కునివెళ్లి, తిరిగి రాకపోతే నేను అన్యాయం అయిపోతాను. అందుకోసం నీదగ్గర డబ్బేమైనా వుంటే ఇయ్యి" అంది విమలమ్మ.

"నా దగ్గర అంతలేదమ్మా రానూపోనూ చార్జీలే వున్నాయ"ంది సత్యవతి.

పోనీ మెడలోవున్న గొలుసుని నాదగ్గర పెట్టి వెళ్లు. నువు రాగానే డబ్బు పంచుకుని, నీ గొలుసు తీస్కుందువుగాని అని నమ్మ బలికింది విమలమ్మ.

సత్యవతి వెంటనే తన మెడలోని గొలుసు తీసి విమలమ్మ చేతికి ఇచ్చి, కాసుతో బయటికి నడుస్తూ "నా సంచీని జాగ్రత్తగా చూస్తూండమ్మా" అంది.

బంగారం షాపులో అతను కాసుని గీటెట్టి చూసి, అబ్బే... ఇది గోల్డ్‌కోటింగ్ కొట్టిన రాగి నాణెం. ఓ ఎనభై రూపాయలు వస్తాయి. అంతే... అన్నాడు.

వెలవెలబోయింది సత్యవతి మొహం. సర్లే అంటూ ఆ డబ్బు తీస్కుని, బస్టాండ్ వైపుకి కాకుండా వేరేదారి పట్టింది.

ఇక బస్టాండ్‌లోని విమల సత్యవతి కను మరుగవగానే కాలికట్టు విప్పదీసి పడేసి, సంచీతోసహా వడివడిగా నడుస్తూ వేరే దారిలో బయటపడి, మరో బంగారం షాపుకి వెళ్లి, గొలుసు అమ్మజూపింది. గీటెట్టి పెదవి విరిచాడు కొట్టాయన. ఇది రోల్డ్‌గోల్డమ్మా... ఓ డెబ్భై రూపాయలు వస్తాయంతే... అని ఇచ్చాడు. ఈసారి తెల్లబోవడం విమలవంతైంది.

బయటకు వచ్చి సంచిలోకిచూస్తే, చినిగి మూసిపోయిన గుడ్డపేలికలు తప్పించి అందులో ఏమీ లేవు. ●



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నర్సాపురం – వై.ఎన్.కళాశాలలో నిర్వహించిన స్కాలర్స్‌డే సందర్భంగా చిత్రకళ, సామాజిక రంగాలలో చేసిన సేవలను పురస్కరించుకొని సంస్కృతీ పురస్కార అవార్డ్ గ్రహీత డా॥ ఉదయ్‌ని సన్మానిస్తున్న పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ సి.సత్యనారాయణ, శ్రీ అందే బాపన్న తదితరులు.